అమ్మకు సంపూర్ణ పోషణ

చెరుకుపల్లి: ఆరోగ్యవంతమైన సమాజం కోసం బాలింతలకు, గర్భిణులకు సంపూర్ణ పోషణ అందించటమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గుళ్లపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుబ్బమ్మ, ధనలక్ష్మి పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కిట్లు పంపిణీ

నగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తోందన్నారు. జెడ్పీటీసీ మాన్యం నాగమణి, తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

కొల్లూరు : గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తోందని కొల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు అన్నారు. గురువారం కొల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ, తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ మురాల నాగలక్ష్మి, తహసీల్దారు ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, ఐసీడీఎస్ అమృతలూరు సీడీపీఓ విజయలక్ష్మి, కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతవరం సెక్టార్ పరిధిలో అనంతవరం, పెసర్లంక గ్రామాలు, దోనేపూడి సెక్టార్ పరిధిలోని చినపులివర్రులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బాజి పాల్గొన్నారు.



కొల్లూరులో కిట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

వేమూరులోకిట్లు పంపిణీ

వేమూరు: గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాని ప్రభుత్వం అందిస్తోందని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు గురువారం ఆయన పంపిణీ చేశారు. తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి భూపతి, వీఆర్వో సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో వ్యాధినిరోధక శక్తి

దుండిపాలెం(వేమూరు): ఎంపీపీ జాలాది రూబేను చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. బిడ్డకు పుట్టిన వెంటనే గంటలోపు ముర్రు పాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధిక శక్తి అందుతుందన్నారు. గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేశారు. తహసీల్దారు కనక దుర్గ, అమర్తలూరు సీడీపీఓ విజయలక్ష్మి, డాక్టరు ఆర్.శ్రీనిధి, సూపర్ వైజర్ శకుంతల, గ్రామ సర్పంచ్ కె.భగవద్గీత, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



కిట్‌లను పంపిణీ చేస్తున్న నగరం ఎంపీపీ, తహసీల్దారు, ఎంపీడీఓ

రేపల్లె రూరల్: పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందినప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని సర్పంచ్ తుపాలకుల దీపిక అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తుమ్మల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేటేరు పంచాయతీలో సర్పంచ్ కనపర్తి వసుమతి, మండల ఉపాధ్యక్షురాలు రావు నెహ్రూలక్ష్మి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కిట్లను అందిస్తున్న మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు



దుండిపాలెంలో కిట్ అందజేస్తున్న ఎంపీపీ జాలాది



కిట్లు పంపిణీ చేస్తున్న వేమూరు తహసీల్దారు

క్లుప్తంగా

60 కిలోమీటర్లు వెళ్లి.. పింఛను ఇచ్చి..



పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు గుంటూరు సమీపంలోని చిన కాకాని వద్ద గల ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా గ్రామ వలంటీర్ శివనాగులు మానసికంగా చికిత్స పొందుతున్న ఆయనకు వృద్ధాప్య పింఛన్‌ను సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించి అందజేశారు. దీంతో వృద్ధుని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఎంపీపీ షేక్ బాజీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు. హాజరు కాని అధికారులపై చర్యలు ఉంటాయని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



నగరం: జంగంలంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వంట సామగ్రి కిట్‌లను పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన నాలుగు కుటుంబాలకు వంట సామగ్రి కిట్‌లు అందించినట్లు తెలిపారు. అడుసుమల్లి ప్రభాకరావు, సీఫర్డ్ సంస్థ ప్రతినిధులు నాగేశ్వరావు, నాగేంద్రరావు పాల్గొన్నారు.

జామ మొక్కల పంపిణీ



తెనాలి: డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న లక్ష జామ మొక్కల పంపిణీలో భాగంగా గురువారం పట్టణ నాజరుపేటలోని 7,8,9,10 వార్డుల్లో మూడు వేల మొక్కలను పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద, మానవత సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్‌తో కలిసి 10వ వార్డులోని సచివాలయం ఆవరణలో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీకి చెందిన 200 మంది విద్యార్థులతో ముందుగా సమావేశమయ్యారు. జామ మొక్కతో కలిగే ఉపయోగాలను వారికి అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలోనూ మొక్కను పెంచేలా గృహస్తులకు నచ్చజెప్పాలని సూచించారు. అవగాహన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులచే ఆయా వార్డుల్లోని ప్రతి ఇంటికి జామమొక్కను పంపిణీ చేశారు. పట్టణంలో నాలుగురోజులుగా మొక్కల పంపిణీని విస్తృతంగా నిర్వహిస్తున్నామని డాక్టర్ శారద చెప్పారు. గురువారం ఒక్కరోజే 7,8,9,10 వార్డుల్లో మూడు వేల మొక్కలను అందజేసినట్టు వివరించారు. ప్రతి ఇంటిలో జామచెట్టు ఉండాలని, ప్రతి కుటుంబం ఆ ఫలాలను తినాలనేది తన ఆకాంక్షగా వివరించారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: బైక్‌ల చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు గురువారం వివరాలు వెల్లడించారు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల బైక్ అపహరణకు గురైంది. వాహన యజమాని పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని షేక్ నాయబ్‌రసూల్ అలియాస్ నాయబాగా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అపహరించిన మరో బైక్ విషయం వెలుగు చూసింది. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు రెండు వాహనాలను స్వాధీనపర్చుకున్నారు. నాయబాను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.

కంప్యూటర్ శిక్షణకు పేర్లు నమోదు చేసుకోండి

తెనాలిఅర్బన్: రాష్ట్ర ఉర్దూ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అకాడమీ ఇన్‌చార్జి షేక్ అత్తాఫ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీలోపు చెంచుపేటలోని ఉమేష్ చంద్ర బొమ్మ దగ్గరలోని ఉర్దూ అకాడమీ సెంటర్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని చెప్పారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్స్ ఇవ్వటం జరుగుతుందని, వివరాలకు 94911 43050 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- రాచూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రాచూరు(భట్టిప్రోలు): రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కుల మతాలకు అతీతంగా మేలు చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని రాచూరులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మంత్రి నాగార్జునకు గ్రామస్తులు స్వాగతం పలికారు. వివిధ సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు చేకూరిన లబ్ధిని మంత్రి వివరించారు. బుక్‌లెట్లను అందజేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్ మేలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు జయవరపు రాధాకృష్ణమూర్తి, బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్‌కుమార్, పెద్దిశెట్టి రాంబాబు, ఉప సర్పంచ్ చిల్కా రత్నబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు దున్నా తిరపతిబాబు, దీవి శ్రీనివాసహరి కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్, సూరేపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, తహసీల్దారు డి.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



రాచూరులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి వివరాల మేరకు.. పెసర్లంక కృష్ణా నదీ ప్రాంతం నుంచి తెల్లవారుజామున కొల్లూరు వైపు వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు గుర్తించారు. వాటిని నిలువరించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దారుకు కేసు బదలాయించనున్నట్లు ఎస్ఐ రాజ్యలక్ష్మి తెలిపారు.

చినపరిమిలో ఫ్యామిలీ ఫిజీషియన్

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వేటపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు కృష్ణవేణి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందచేశారు. 283 మందికి వైద్య సేవలు అందించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

6న యూపీఎఫ్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

తెనాలి: మణిపూర్‌లో జరిగిన దురాగతాలకు నిరసిస్తూ, అక్కడ శాంతిని ఏర్పరచాలనే డిమాండ్‌తో ఈనెల 6వ తేదీన చుండూరు మండలం వలివేరు గ్రామం నుంచి శాంతిర్యాలీని నిర్వహించనున్నారు. చుండూరుకు చెందిన యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ శాంతి ర్యాలీని జరపనున్నట్టు చైర్మన్ బి.సముయేలు గురువారం తెలియజేశారు. వలివేరు పెట్రోలు బంక్ దగ్గర నుంచి వేటపాలెం మీదుగా చుండూరు మండల తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగే ర్యాలీని అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. యూపీఎఫ్ అధ్యక్షుడు ఎం.జాన్‌బాబు, ఉపాధ్యక్షుడు ఇశ్రాయేలు, కార్యదర్శి ఎం.ఉజ్జీవరత్నం, సంయుక్త కార్యదర్శి కె.యబ్బేజు, కోశాధికారి జి.పురుషోత్తం పాల్గొన్నారు.

శాంతియుత ర్యాలీ

భట్టిప్రోలు: మణిపూర్ క్రైస్తవుల న్యాయం కోసం జీసస్ గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలులో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ సంఘాల నేతలు మాట్లాడుతూ మణిపూర్ ప్రభుత్వ అసమర్థత వల్లే ఆదివాసి క్రైస్తవులు, చర్చిలపై అసాంఘిక శక్తులు దాడులు చేసి, విధ్వంసం సృష్టించాయని విమర్శించారు. మహిళలపై అల్లరి మూకల పాశవిక చర్యలు అత్యంత హేయమని ఖండించారు. బాధితులకు పునరావాసం కల్పించి ఆదుకోవాలని కోరారు. దాడులకు తెగబడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బిషప్స్, రెవరెండ్స్, పాస్టర్లు, ఆయా సంఘాల దైవజనులు, సువార్తికులు, సేవకుల సహవాసులు ఆర్‌సీఎం చర్చి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు, పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రాలు అందజేసారు.



మాట్లాడుతున్న యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ నాయకులు

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

బాపట్ల అర్బన్: పిల్లల్లోని సృజనాత్మక ఆలోచనలు గుర్తించి నిరంతరం వారిని ప్రోత్సహించడం ఉత్తమ ప్రధానోపాధ్యాయుల లక్షణమని కైవల్య ఫౌండేషన్ అధ్యక్షురాలు తేజస్విని మిశ్రా అన్నారు. సమగ్రశిక్షా అభియాన్ సమావేశ మందిరంలో జరిగిన మూడో విడత ప్రాంతీయ జిల్లాల సెకండరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నాయకత్వ నిర్మాణ శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బాపట్లలోని విస్తరణ శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రోల్‌మోడల్‌గా నిలవాలని పేర్కొన్నారు. మంచి పౌరులను సమాజానికి అందించాలన్నారు. శిక్షణలో భాగంగా వివిధ రకాల నమూనాలు ఎలా తయారు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకురాలు కల్పన మాట్లాడుతూ బోధన పర్యవేక్షణ పద్ధతులు, పాఠ్య ప్రణాళికలు ఐసీటీపై డీఆర్‌పీలు శిక్షణ పొందాలని సూచించారు. సమగ్ర శిక్షా బాపట్ల అకడమిక్ మానిటరింగ్ అధికారి మోజెస్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు తయారుచేసిన నమూనాలను పరిశీలించిన మిశ్రా, కల్పన

వైఎస్సార్ సీపీతోనే సంపూర్ణాభివృద్ధి సాధ్యం

- వచ్చే ఏడాది నుంచి మెడికల్ కళాశాలలో సేవలు
- ప్రతిపక్ష పార్టీలు ఎన్ని గుంపులుగా వచ్చినా సీఎం వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి
- పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే కోన

బాపట్ల: వైస్సార్ సీపీతోనే రాష్ట్రంలో సంపూర్ణాభివృద్ధి జరుగుతుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి పుట్టినరోజు సందర్భంగా గురువారం ఆయన నివాసంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం బాపట్లలోని పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే శక్తి ప్రతిపక్షానికి లేక కొన్ని గుంపులను పోగేసుకుని ముందుకొస్తున్నాయని కోన ధ్వజమెత్తారు. ఒక పక్కన అభివృద్ధి..మరోపక్కన సంక్షేమం నేరుగా పేద, బడుగు, బలహీనులకు అందిస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. బాపట్లను జిల్లా కేంద్రంగా ఇవ్వటంతోపాటు అడిగిందే తడువుగా అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. బాపట్లలో రూ.540 కోట్లతో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. 2024 డిసెంబరు నుంచి మెడికల్ కళాశాలలో వైద్యసేవలు అందేవిధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2025లో మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం చేసే విధంగా నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. నిజాయితీతో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్ళీ అధికారం ఇస్తే భావితరాలకు మంచి భవిష్యత్ లభించిందని చెప్పారు.

అభివృద్ధి పనుల కోసమే ఇసుక..

బాపట్ల నియోజకవర్గంలో పరిధిలో ఒక పక్కన మెడికల్ కళాశాల, మరో పక్కన జాతీయరహదారి, అంతర్గత రోడ్లు నిర్మాణాలకు ఇసుక ఉపయోగిస్తున్నామని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. ఈ ఇసుక కోసం ప్రభుత్వానికి రూ.12కోట్లు మేరకు పన్నులు రూపంలో చెల్లించటం వల్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, మాజీ కౌన్సిలర్ కాగిత యజ్ఞయ్య, జీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ, వి రిసార్ట్స్అధినేత సందీప్, మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ చినపోతుల హరిబాబు, చింతల రాజశేఖర్, ఇనగలూరిమాల్యాద్రి, కొక్కిలిగడ్డ చెంచయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



భారీ గజమాలతో ఎమ్మెల్యే కోన రఘుపతిని సత్కరిస్తున్న అభిమానులు



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన

దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి

దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా పలువురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత షేక్.సయ్యద్ పీర్, నర్రావుల వెంకట్రావు, శాయిల మురళి, గుంజి ఏడుకొండలు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం: చందోలు శివారు నదిముల్లాయపాలెం గ్రామంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పుట్టిన రోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఇర్ఫాన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పెద్దలు కేక్ కత్తిరించి, స్వీట్లు పంచిపెట్టారు. ఎమ్మెల్యే కోన రఘుపతికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

వెలుగు సీసీపై యానిమేటర్ ఫిర్యాదు

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ కో–ఆర్డినేటర్ శేషగిరిరావు లంచాలు వసూలు చేయాలని డిమాండు చేస్తున్నారని సంగుపాలెం యానిమేటర్ కుమారి అధికారులకు ఫిర్యాదు చేశారు. రుణాలు పొందిన గ్రూపు సభ్యుల నుంచి లంచాలు వసూలు చేసి, తనకు కొంత ఇవ్వాలని డిమాండు చేస్తున్నారని, లేకపోతే గ్రూపు పనులు పెండింగ్‌లో ఉంచుతున్నారని ఆరోపించారు. ఈ విషయాల గురించి సీసీ శేషగిరిరావు ఫోన్‌లో మాట్లాడిన సంభాషణలు, ఆయనకు చెల్లించిన నగదు ఫోన్ పే వివరాలు ఆధారాలతో సహా అన్నీ తన వద్ద ఉన్నాయని యానిమేటర్ తెలిపింది. దీంతో స్పందించిన వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సంతోష్ ఇద్దరినీ డ్వాక్రా కార్యాలయానికి పిలిపించి, విచారించారు. యానిమేటర్ కుమారి మాట్లాడుతూ సీసీ శేషగిరిరావు డ్వాక్రా గ్రూపు సభ్యులకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, ఇతర పొదుపు రుణాలు ఇప్పించినందుకు ఒక్కో సభ్యురాలి నుంచి రూ.500 చొప్పున గ్రూపుకు రూ.5వేలు వసూలు చేయాలని, అందులో సగం తనకు ఇచ్చి మిగిలిన సగం.. తనను తీసుకోమని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించింది. అదేవిధంగా కొత్తగా గ్రూపును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటే రూ.1000 చొప్పున వసూలు చేయాలని ఆదేశించడంతో పాటు చేయకపోతే తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని వివరించింది. వసూలు చేయకపోతే రికార్డులపై సంతకాలు చేయకుండా పెండింగ్‌లో పెడుతున్నారని పేర్కొంది. ఈ విషయంపై శేషగిరిరావు మాట్లాడుతూ ఎవరినీ లంచాల విషయంపై ఒత్తిడి చేయలేదని తెలిపారు. సదరు యానిమేటరు పని విషయంలో నిర్లక్ష్యంగా ఉంటోందని, అందు వల్లనే తనపై ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. తనకు ఎప్పుడైనా డబ్బులు అవసరమైతే అప్పుగా యానిమేటర్ నుంచి ఫోన్ పే ద్వారా కొంత నగదు తీసుకున్నానని సీసీ తెలిపారు. ఏపీఎం సంతోష్ మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం సంతోష్

చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ



భట్టిప్రోలు: గ్రామ పునర్నిర్మాణ సంస్థ(వీఆర్వో)ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీ కాలనీలలో చిన్నారులకు విద్యా సామగ్రిని గురువారం అందజేశారు. వీఆర్వో సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ శౌరిరాజు మాట్లాడుతూ భట్టిప్రోలు పరిధిలోని రైల్వే గేట్, అల్లూరు కాల్వకట్ట, అద్దేపల్లి ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, పలకలు అందించినట్లు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో దశాబ్దంగా వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని నాలుగు మండలాల్లో గృహ నిర్మాణాలు, స్వయం ఉపాధి కింద శిక్షణలు, పొదుపు సంఘాల ఏర్పాటు, సాయంత్రం బడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నాలుగు మండలాల్లో 350 మంది విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, పంచాయతీ వార్డు సభ్యులు గోలి సుధ, సంస్థ రేపల్లె సర్కిల్ కో–ఆర్డినేటర్ కె.దేవకి, వీఆర్వో సంస్థ వలంటీర్లు, వైఎస్సాఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

93.74 శాతం పింఛన్ల పంపిణీ

వేమూరు: మండలంలో 6,902 పింఛన్‌దారులకు గాను 6,470 మందికి పింఛన్ నగదు పంపిణీ జరిగింది. 93.74 శాతం నగదు పంపిణీ పూర్తయిందని, మిగిలిన వారికి ఇంటి వద్దకు వెళ్లి వలంటీర్లు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం తెలిపారు.

పశుపోషకుల ఆర్థిక వృద్ధే లక్ష్యం

రేపల్లె: పశుపోషకుల ఆర్థికవృద్ధే లక్ష్యంగా జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని తహసీల్దారు డి.మల్లికార్జునరావు అన్నారు. జగనన్న పాల వెల్లువ పథకంపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పశు సంవర్ధకశాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు తెలియజేయాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, పశువైద్యులు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిల్వచేసిన రేషన్ బియ్యం స్వాధీనం



కొల్లూరు : నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొల్లూరు పోస్టాఫీసు సమీపంలో సామ కార్తిక్ అనే యువకుడు తన కుటుంబంతో కలసి రేషన్ బియ్యం వ్యాపారం కొనసాగిస్తున్నాడు. రేషన్ బియ్యాన్ని భారీ ఎత్తున సేకరించి, ఇతర ప్రాంతాలకు తరలిస్తుండటంపై సివిల్ సప్లయీస్ అధికారులకు సమాచారం అందడంతో స్థానిక రెవెన్యు యంత్రాంగంతో కలసి గురువారం అతని గృహంలో దాడులు నిర్వహించారు. ఇంట్లో నిల్వ చేసి ఉంచిన 9.50 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి, సివిల్ సప్లయీస్ డీటీ ఆర్.శరత్ వాటిని స్వాధీనం చేసుకున్నారు. యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఎస్ డీటీ తెలిపారు. గతంలో కూడా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంపై ఇదే యువకుడి పలు కేసులు నమోదైనట్లు తెలిపారు.

వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా రాజశేఖర్



కూచిపూడి(వేమూరు): కూచిపూడి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం అధ్యక్షుడిగా కనగాల రాజశేఖర్‌ను నియమించినట్లు సహకారం సంఘం కార్యదర్శి బాజీ ప్రసాద్ గురువారం తెలిపారు. అమర్తలూరు మండలంలోని యడవూరు గ్రామానికి చెందిన కనగాల రాజశేఖర్ సొసైటీ అధ్యక్షుడిగా నియామకం కావడంతో గ్రామస్తులు అభినందించారు. సొసైటీ అధ్యక్షుడిగా ఇప్పటి వరకు యలవర్తి సురేష్‌ను పని చేశారు. ఆయన స్థానంలో రాజశేఖర్ నియమించడం జరిగిందని ఆయన తెలిపారు.